పాస్‌పోర్ట్ స్లాట్స్ వేగవంతం

- 25 నుంచి 18 రోజులకు తగ్గింపు
- ప్రతిరోజూ 4వేల స్లాట్స్ బుకింగ్
- 6నెలల్లో 3.96 లక్షల పాస్‌పోర్ట్‌లు
- ప్రతి గురువారం ఫిర్యాదులకు అవకాశం
- ఏవైనా సందేహాలుంటే వాట్సాప్ నంబర్ 8121401532కు సంప్రదించండి
- 'నమస్తే తెలంగాణ'తో రీజినల్ పాస్‌పోర్టు అధికారి జొన్నలగడ్డ స్నేహజ

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 28 (నమస్తే తెలంగాణ) : పాస్‌పోర్ట్.. ఇది మన జాతీయతను నిర్ధారించే గుర్తింపు పత్రం. విద్య, ఉద్యోగం, వ్యాపారం, విహారం, వైద్యం తదితరాల కోసం అనేక మంది విదేశాలకు వెళ్తుంటారు. ఏటా వీరి సంఖ్య పెరుగుతూనే ఉన్నది. అలాంటి వారికి పాస్‌పోర్ట్ అనేది అనివార్యం. ఈ క్రమంలో డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారులు పాస్‌పోర్టుల జారీలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఆర్పీవో జొన్నలగడ్డ స్నేహజ నేతృత్వంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఏర్పాటు చేసి దరఖాస్తుదారుల సమస్యలకు పరిష్కారం చూపుతూనే పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు, పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో స్లాట్ బుకింగ్ కోసం 25 రోజుల దాకా సమయం పట్టేది. ఇప్పుడు కేవలం 18 రోజుల్లోనే స్లాట్స్ లభిస్తుండటం విశేషం. అనేక మందికి నిరీక్షణ ఇబ్బందుల్లేకుండా తత్కాల్ అడ్జస్ట్‌మెంట్స్, నార్మల్ స్లాట్స్ పెంచడం తదితర వాటితో సేవలు త్వరగా పూర్తి చేస్తున్నారు. దీనికి గానూ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి హైదరాబాద్ ఆర్పీవోకు ప్రశంసలు సైతం దక్కాయి. ఈ సందర్భంగా పాస్‌పోర్ట్ సేవలపై రీజనల్ పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజ 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

రోజుకు 4వేల దరఖాస్తులు

రోజుకు 4వేల దరఖాస్తులు వస్తున్నాయి. ఇందులో పాస్‌పోర్ట్‌కు సంబంధించనవి 3,500 దాకా ఉంటాయి. మిగిలినవి పీసీసీ, రీఇష్యూకు సంబంధించనవి ఉంటున్నాయి. కొన్ని దేశాలు పీసీసీ (పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్) ప్రత్యేకంగా ఉండాల్సిందేననే నిబంధనలు పెడుతాయి. కంట్రీ స్పెసిఫిక్, పర్పస్ స్పెసిఫిక్‌గా పీసీపీ జారీ చేస్తాం. దీని గడువు 6 నెలలు మాత్రమే ఉంటుంది. ఈ ప్రక్రియలో కూడా వేగం పెంచాం. చాలా మంది తత్కాల్ అవసరం లేకున్నా దరఖాస్తు చేస్తున్నారు. సరైన డాక్యుమెంట్లు చూపలేకపోతున్నారు. దీనిపై అవగాహన కల్పిస్తున్నాం. పాస్‌పోర్టు వెబ్‌సైట్‌లో నిబంధనలు చదివాకే దరఖాస్తు చేసుకోవాలి.

ప్రింట్ తప్పుపడిందా?

కొందరు తమ పాస్‌పోర్ట్‌లో చిన్నచిన్న తప్పిదాలు వచ్చాయంటూ కార్యాలయానికి ఫిర్యాదు చేస్తుంటారు. వాళ్లు పాస్‌పోర్టు ప్రక్రియలో ఏమరుపాటుతో తప్పుడు వివరాలు నమోదు చేస్తారు. పాస్‌పోర్ట్ జారీ అయ్యాక బాధపడుతుంటారు. అలాంటి వారికి తిరిగి సరైన వివరాలతో పాస్‌పోర్ట్ జారీ చేస్తున్నాం.

ఐదేండ్లలో జారీ ఇలా..

2019-5,32,785
2021-4,28,246
2022-6,43,157
2023- 7.85,485
2024 (ప్రస్తుతం)-3.96లక్షలు

దీనికోసం వాళ్లు మళ్లీ స్లాట్ బుక్ చేసుకోవాల్సిన అవసరం లేదు. కేవలం 6 నెలల్లోపే సరైన వివరాలతో పాసుపోర్ట్ జారీ చేస్తున్నాం. 6 నెలలు దాటితే మళ్లీ స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. కేవలం చిన్నచిన్న ప్రింటింగ్ ఇష్యూలకు మాత్రమే అనుమతిస్తాం. పేరు మార్చడం లాంటివి కుదరదు.

పాసుపోర్ట్ చాలా కీలకం

ఇటీవల కొందరు విదేశాల్లో పాస్‌పోర్ట్‌లు పోగొట్టుకున్న కేసులు మా దృష్టికి వచ్చాయి. అలాంటి సమయంలో వాళ్లు అక్కడున్న ఇండియన్ ఎంబసీని ఆశ్రయించాల్సి ఉంటుంది. వాళ్లు ఒక ఎమర్జెన్సీ సర్టిఫికెట్ జారీ చేస్తారు. కానీ, వాళ్లు అక్కడ ఉండటానికి వీల్లేదు. ఆ సర్టిఫికెట్ కేవలం తిరిగి ఇండియాకు రావడానికే. తొలుత వాళ్లు ఎన్ని రోజుల వరకు అక్కడ ఉండాలనుకుని వెళ్లారో అదంతా కోల్పోయినట్టే. ఇక్కడికి వచ్చాక మళ్లీ పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. చాలా మందికి ఇలాంటి అనుభవాలు ఎదురయ్యాయి. పాస్‌పోర్ట్ పోగొట్టుకున్న రెండు రోజుల్లోనే ఇండియాకు రావాల్సి ఉంటుంది.

దేశంలో ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చు

హైదరాబాద్ ఒక మినీ ఇండియా. ఇక్కడ అనేక రాష్ట్రాల నుంచి వచ్చినవారు నివాసం ఉంటారు. పాస్‌పోర్ట్ కోసం దేశంలోని ఏ పాస్‌పోర్ట్ కార్యాలయంలోనైనా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఇక్కడి చిరునామా ఉంటే పోలీసు విచారణ సులభతరమవుతుంది. కొందరు తమ సొంత రాష్ట్రాల చిరునామాలు పెడుతుంటారు. వారి పోలీస్ ఎంక్వైరీ ఆ రాష్ట్రాల్లో జరిగిన అనంతరం అక్కడి నుంచి పీసీసీ వచ్చాక మిగిలిన ప్రక్రియ పూర్తి చేస్తాం. ఇందుకు కొంచం సమయం ఎక్కువ తీసుకుంటుంది.

గడువు ముగిస్తే ఇలా..

చాలా మంది పాస్‌పోర్ట్ గడువు ముగిసిందని ఆందోళన చెందుతుంటారు. ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక దళారులను ఆశ్రయించి మోసపోతుంటారు. పాస్‌పోర్ట్ గడువు ముగిస్తే తీసుకోవాల్సిన చర్యలపై ఆర్పీవో కార్యాలయం ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. పాస్‌పోర్ట్ నిబంధనల విషయానికొస్తే 18 ఏళ్లు దాటిన వారికి జారీ చేసిన రోజు నుంచి పదేళ్ల పాటు చెల్లుబాటులో ఉంటుంది. తర్వాత దాన్ని పునరుద్ధరించుకోవాలి. పాస్‌పోర్ట్ గడువు ముగిసిన మూడేళ్ల వరకు లేదా గడువు ముగియడానికి ఏడాది ముందుగా రెన్యూవల్ చేసుకునే వీలుంది. ఆన్‌లైన్‌లో రెన్యూవల్ చేసుకోవచ్చు. పాస్‌పోర్ట్‌సేవా వెబ్‌సైట్‌లోకి వెళ్లి కొత్త వినియోగదారుగా నమోదు కావాలి లేదా ఇదివరకే లాగిన్ ఐడీ ఉంటే దాంతో లాగిన్ కావొచ్చు. పాస్‌పోర్ట్ రీ ఇష్యూ క్లిక్ చేస్తే మిగిలిన స్టెప్పులన్నీ వస్తాయి. వాటిని సక్రమంగా ఫిల్ చేసి స్లాట్ బుక్ చేసుకుంటే సరిపోతుంది.

మెయిల్ చేస్తే చాలు

పాస్‌పోర్ట్ ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులెదురైతే మాకు మెయిల్ చేయొచ్చు. మేం పబ్లిక్ గ్రీవెన్సీ సెల్ ఏర్పాటు చేశాం. మెయిల్, ఎక్స్‌లో మా టీం అందుబాటులో ఉంటుంది. ప్రతి గురువారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల మధ్య నేరుగా ఆర్పీవో కార్యాలయాన్ని సందర్శించొచ్చు. మా మెయిల్ ఐడీ rpo.hyderabad@mea.gov.in మెయిల్ చేయొచ్చు. మా వాట్సాప్ నంబర్ 8121401532. రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మా టీం అందుబాటులో ఉండి దరఖాస్తుదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తాం. పాస్‌పోర్ట్ స్టేటస్ కూడా తెలుసుకోవచ్చు. మెయిల్‌లోనే ఇబ్బందులు తెలియజేయండి. ఎక్స్ తదితర వాటిలో వద్దు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

అరుణ్ (ఫైల్)

మంచాల, జూన్ 28: ఉపాధి కరువై.. అప్పులు పేరుకుపోవడంతో ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మంచాల డవున్ పరిధిలో జరిగింది. ఎస్సై రవినాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మతండా గ్రామానికి చెందిన సపావట్ అరుణ్ (26) భార్య ఇద్దరు పిల్లలతో హైదరాబాద్‌లో ఉంటూ ఆటో తోలుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నినెలల క్రితం అరుణ్ రూ. 3 లక్షలు ఆటోపై నాన్స్ తీసుకున్నాడు. ఈఎంఐ కట్టకపోవడంతో ఫైనాన్స్ వ్యాపారులు ఒత్తిడి తెస్తున్నారు. ఇటీవలి పరిణామాలతో ఆటో నడవకపోవడంతో ఈఎంఐ కట్టడం భారంగా మారింది. ఆర్థిక సమస్యలతో మనస్తాపానికి గురైన అరుణ్ గురువారం ఎల్లమ్మతండాకు వచ్చి ఇంట్లో పురుగు మందు తాగాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో చనిపోయిన విషయం శుక్రవారం గ్రామస్థులకు తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

దడ పుట్టిస్తున్న కూరగాయల ధరలు

- చిల్లర మార్కెట్‌లో 60 శాతం పెరుగుదల
- ఆకుకూరలకూ రెట్టింపు డిమాండ్
- ఉత్పత్తి పెంచేందుకు ప్రణాళికలపై దృష్టి
- ఆర్‌కేవీవై సబ్సిడీ పునరుద్ధరించాలని రైతుల విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కూరగాయల ధరలు దడపుట్టిస్తున్నాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల మందగమనం, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు తగ్గిపోవడం కూరగాయల దిగుబడులపై తీవ్రంగా ప్రభావం చూపించింది. ఫలితంగా రైతుబజార్లతో పోలిస్తే చిల్లర మార్కెట్‌లో ఏకంగా 60 శాతం వరకు ధరలు అధికం కావడం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా వేసవిలో కూరగాయల ధరలు పెరుగుతాయి. వర్షాకాలం మొదలవగానే మళ్లీ తగ్గుతుంటాయి. కానీ ఈసారి అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి సీజన్‌లో అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరల ధరలు నియంత్రణలోనే ఉన్నాయి. వర్షాకాలం మొదలయ్యాక, వర్షాభావ పరిస్థితుల నడుమ నగరం, పట్టణం, గ్రామం అన్న తేడాలు లేకుండా 20రోజుల వ్యవధిలోనే అమాంతంగా ధరలు పెరిగాయి.

తగ్గిన కూరగాయల సాగు

తెలంగాణ జనాభాకు ప్రతి ఏటా 38.54 లక్షల టన్నుల కూరగాయలు అవసరం. ప్రస్తుతం 19.54 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. రాష్ట్రంలో ఒక కోటి 31లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన ఆహార

పంట వరి సహా పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు, కంది, పెసర, ఇతర చిరుధాన్యాలు వంటి అన్ని రకాల పంటలు సాగవుతుండగా, అందులో కూరగాయల పంటలు 3.11లక్షల ఎకరాలకే పరిమితం అయ్యాయి. ఈ కారణంగా సుమారు 19 లక్షల టన్నుల దిగుబడుల కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ వేసవిలో స్థానికంగా కూరగాయలు ఉత్పత్తి 25 శాతం తగ్గిపోయింది.

అకాల వర్షాలతో ప్రభావం

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లో అకాల వర్షాలు, వడగండ్ల వానలు, ఈదురుగాలులు కూరగాయలు, ఆకుకూరల తోటలను దెబ్బతీశాయి. హైదరాబాద్ చుట్టూ ఉన్న

కూరగాయలు	కేజీ ధర(రూ.)
టమాటా	100
వంకాయ	40
పచ్చిమిర్చి	80
బీన్స్	120
గింజ చిక్కుడు	80
క్యారట్, బీట్‌రూట్	70
క్యాప్సికం	80
సోరకాయ	40
కాకరకాయ	50
పందిరి బీర	60
ఆకుకూరలు	20 (2,3 కట్టలు)
ఉల్లిగడ్డ	50

రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, మహబూబ్‌నగర్, యాదాద్రి, నల్గొండ తదితర జిల్లాల్లో కూరగాయల దిగుబడులు తగ్గడంతో ఇతర రాష్ట్రాల నుంచి తెస్తున్నారు. ఫలితంగా కూరగాయల ధరలపై రవాణా భారం కూడా పడుతున్నది. జనాభా అవసరాలకు తగ్గట్టుగా కూరగాయల సాగు పెరగాలంటే ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

ఆర్‌కేవీవై సబ్సిడీ పునరుద్ధరణ

ఆర్‌కేవీవై (రాష్ట్రీయ కృషి వికాస్ యోజన) కింద రైతులకు 50 శాతం రాయితీపై అధిక దిగుబడులు ఇచ్చే హైబ్రీడ్ వంగడాలు, రసాయన ఎరువులను ప్రభుత్వం అందజేసేది. రాయితీలు, రుణాలను ఇచ్చి ప్రోత్సహించేది. వాటిని పునరుద్ధరిస్తే కూరగాయల సాగు పెరుగుతుందని అధికారులు అంటున్నారు.

'బాసర'లో ఇంటి దొంగల చేతివాటం

- లడ్డూ, పులిహోర విక్రయాల్లో గోల్‌మాల్
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న గ్రామస్థులు
- ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగుల సస్పెండ్
- నలుగురు తాత్కాలిక ఉద్యోగుల తొలగింపు
- ఆలయ ఈవో విజయరామారావు వెల్లడి

చించేయని లడ్డూ టికెట్లను పరిశీలిస్తున్న ఈవో విజయరామారావు

బాసర, జూన్ 28: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ ఆలయంలో లడ్డూ, పులిహోర ప్రసాద విక్రయాల్లో ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించి గ్రామస్థులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. శుక్రవారం లడ్డూ, పులిహోర తయారీ స్టోర్ నుంచి నాలుగు బుట్టల పులిహోర ప్యాకెట్లను విక్రయ కేంద్రం వద్దకు ఆటోలో తీసుకొచ్చారు. గ్రామస్థులు అనుమానంతో ఆటోలో ఉన్న పులిహోర ప్యాకెట్లను పరిశీలించి రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. నాలుగు బుట్టల్లో మొత్తం 350 పులిహోర ప్యాకెట్లకు 690 ప్యాకెట్లు ఉన్నాయి. వెంటనే గ్రామస్థులు ఆలయ ఈవో విజయరామారావుకు సమాచారం అందించారు. ఈవో అక్కడికి చేరుకొని తనిఖీ చేయగా 340 ప్యాకెట్లు అదనంగా ఉన్నట్టు గుర్తించారు. లడ్డూలు విక్రయించే కేంద్రం వద్ద టికెట్లు రీసైక్లింగ్ అవుతున్నట్టు గ్రామస్థులు తెలిపారు. వాటిని తనిఖీ చేసి చింపకుండా ఉన్న టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టిన అనంతరం.. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేశారు. నలుగురు తాత్కాలిక ఉద్యోగులను పూర్తిగా విధుల నుంచి తొలగించారు. ఈ విషయమై ఈవో విజయరామారావును వివరణ కోరగా.. లడ్డూ, పులిహోర విక్రయాల్లో అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనని తెలిపారు. పులిహోర స్టాక్ రిజిస్టర్ కంటే స్టోర్ నుంచి అదనంగా విక్రయ కేంద్రానికి వచ్చినట్టు, టికెట్లు రీసైక్లింగ్ అవుతున్నట్టు విచారణలో తేలిందని చెప్పారు. ఈ ఘటనలో సూపరింటెండెంట్ శివరాజ్, రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్‌ను సస్పెండ్ చేశామని, తాత్కాలిక ఉద్యోగులుగా పని చేస్తున్న రాజేశ్వర్, రవి, మోహన్‌రెడ్డి, సాయన్నను విధుల నుంచి పూర్తిగా తొలగించామని వివరించారు.

అదానీకి మన పవర్!

మొదటిపేజీ తరువాయి...

విద్యుత్తు బిల్లుల వసూలు బాధ్యతను అదానీ కంపెనీకి అప్పగించామని స్పష్టంచేశారు. పాతబస్తీలో అండర్‌గ్రౌండ్ విద్యుత్తు లైన్లు వేసి మొత్తం వ్యవస్థను మార్చాలని అదానీ కంపెనీని కోరామంటూ సమర్థించుకునే ప్రయత్నంచేశారు. ఇది విద్యుత్తు ప్రైవేటీకరణకు ఆరంభం మాత్రమేనని, క్రమంగా హైదరాబాద్ నగరం, ఆ తర్వాత రాష్ట్రం మొత్తంగా విద్యుత్తు పంపిణీ వ్యవస్థను అదానీ గ్రూపునకు కట్టబెట్టాలన్నది రేవంత్ సర్కారు కుట్ర అని విద్యుత్తురంగ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇదే జరిగితే విద్యుత్తు పంపిణీ సంస్థలకు ఉరితాళ్లు బిగియడం ఖాయమని, కరెంట్ కావాలన్నా, కనెక్షన్ కావాలన్నా అదానీ ముందు తెలంగాణ ప్రజలు, వినియోగదారులు మోకరిల్లాల్సిన పరిస్థితులు వస్తాయని హెచ్చరిస్తున్నారు. పాతబస్తీతో మొదలుపెట్టి రాష్ట్రమంతా విడతల వారీగా ట్రాన్స్‌కో, జెన్‌కోలను అదానీ చేతిలో పెట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నదని చెబుతున్నారు.

గృహజ్యోతి ఉండగా నష్టాలెలా?

కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలో గృహజ్యోతి పథకాన్ని అమలుచేస్తున్నామని చెబుతున్నది. ఈ పథకం కింద 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా అందిస్తున్నట్టు పేర్కొంటున్నది. పాతబస్తీలో ఎక్కువగా గృహ వినియోగదారులే ఉన్నారు. వీరిలో అధికమొత్తం పేదలే. 200 యూనిట్లు ఉచితం అయినప్పుడు నష్టాలు ఎలా అనే ప్రశ్న తలెత్తుతున్నది. ఇక్కడ బిల్లుల పెండింగ్‌లో ఉన్నాయని, వసూలుకు వెళ్లిన సిబ్బందిపై స్థానికులు దాడులు చేస్తున్నారని ప్రభుత్వం చెబుతున్నది. ఇలా పాతబస్తీని సాకుగా చూపి తెలంగాణ విద్యుత్తు వ్యవస్థను మొత్తం అదానీకి తాకట్టుపెట్టే కుట్రకు రేవంత్ సర్కారు తెరతీసిందన్న విమర్శలు వస్తున్నాయి. గుజరాత్, ముంబై తదితర ప్రాంతాల్లో అదానీ, టాటా పవర్ కంపెనీలు కొన్ని ప్రాంతాలను కైవసం చేసుకున్నాయి.

అప్పుడు తప్పు.. ఇప్పుడు ఒప్పు..

బహిరంగ టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిలో ఎంఓయూ ద్వారా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి గత కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్తు కొనుగోలు చేస్తే తప్పు అని ఏకంగా దీనిపై విద్యుత్తు విచారణ సంఘాన్ని వేసి ప్రభుత్వం విచారణ జరుపుతున్నది. భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్లను ప్రభుత్వ రంగంలోని బీహెచ్ ఈఎల్‌కు అప్పగించినందుకు గగ్గోలు పెడుతున్నది. మరి టెండర్లు లేకుండా సీఎం రేవంత్ రెడ్డి, అదానీ గ్రూపునకు రాజధానిలోని ఓ కీలక ప్రాంతాన్ని, అదీ ఓ ప్రైవేట్ కంపెనీకి ఎలా అప్పగిస్తారన్న ప్రశ్న తలెత్తుతున్నది. కేసీఆర్ హయాంలో ఒక ప్రభుత్వంతో మరో ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలతో ఒప్పందం చేసుకుంటే తప్పు, ఇప్పుడు ప్రభుత్వం ఓ ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంటే ఒప్పు ఎలా అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఏకంగా ప్రకటన చేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దావోస్‌లో అదానీతో రేవంత్‌కు కుదిరిన బంధం మరింత పటిష్టమైందని, ఇక క్రమంగా అన్ని రంగాల్లో అదానీకి రేవంత్ రెడ్ కార్పెట్ పరుస్తారన్న వాదనలున్నాయి.

మున్ముందు జరిగేది ఇదే!

- విద్యుత్తు సవరణ చట్ట ప్రకారం రాష్ట్రంలో విద్యుత్తు పంపిణీ వ్యవస్థ ప్రాంచైజీలుగా మారిపోతుంది. అంటే ఇప్పుడున్న దక్షిణ తెలంగాణ, ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థల్లోని ప్రాంతాలను ప్రాంచైజీలుగా ప్రైవేట్ సంస్థల చేతుల్లో పెడతారు.
- వేలకోట్ల ప్రజాధనాన్ని వెచ్చించి విద్యుత్తు పంపిణీ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. వీటిపై పూర్తిగా గుత్తాధిపత్యం అదానీదే అవుతుంది. విద్యుత్తు లైన్లు, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ ప్రైవేట్ చేతుల్లోకి వెళ్తాయి.
- ఇప్పుడు వినియోగదారులు ఎప్పుడంటే అప్పుడు కనెక్షన్లు పొందుతున్నారు. అదానీ చేతుల్లోకి వెళ్తే వాళ్లు ఎప్పుడిస్తే అప్పుడే కనెక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది.
- ఇప్పుడు ఏదైనా సమస్య తలెత్తితే విద్యుత్తు సిబ్బంది వచ్చి ఉచితంగా మరమ్మతులు చేసి వెళ్తున్నారు. ప్రైవేట్ చేతుల్లోకి వెళ్తే సేవలకు సర్వీస్‌చార్జీలు వసూలు చేస్తారు. సేవలు పొందినందుకు వినియోగదారులు అదానీ విధించే చార్జీలు భరించాల్సిందే.
- విద్యుత్తు సవరణ బిల్లును తాము అమలు చేయబోమని గత సీఎం కేసీఆర్ పలుమార్లు బహిరంగంగా ప్రకటించారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి సర్కారు కేంద్రం ముందు మోకరిల్లి విద్యుత్తు సవరణ బిల్లును రాష్ట్రంలో అమలుచేసేందుకు సిద్ధపడింది. ఇక భవిష్యత్తులో వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించే రోజులూ రాబోతున్నాయి.

వలస బతుకులు తునాతునకలు

- కంప్రెషర్ పేలి ఐదుగురి దుర్మరణం
- సౌత్ గ్లాస్ పరిశ్రమలో ఘోరం

రంగారెడ్డి, జూన్ 28(నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండలం చింతగూడ పంచాయతీ పరిధిలోని సౌత్ గ్లాస్ పరిశ్రమలో శుక్రవారం గ్యాస్ కంప్రెస్ చేస్తుండగా కంప్రెషర్ పేలి నలుగురు కార్మికులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. దవాఖానలో చికిత్స పొందుతూ మరొకరు మృతిచెందారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి శరీర భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. మృతులు, క్షతగాత్రులంతా యూపీ, బీహార్‌కు చెందినవారుగా పోలీసులు గుర్తించారు. గాయపడ్డవారికి షాద్‌నగర్, శంషాబాద్‌లోని హాస్పిటళ్లలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం సమయంలో సుమారు 200 మంది కార్మికులు డ్యూటీలో ఉన్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన చిత్తరంజన్(31), రాంప్రకాశ్ (31), యూపీకి చెందిన నిఖిత్‌కుమార్ (22), ఒడిశాకు చెందిన రతికాంత్(25) అక్కడికక్కడే మృతిచెందారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామ్‌సేత్(24) శంషాబాద్‌లోని ఆసుపత్రిలో చనిపోగా మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని కలెక్టర్ శశాంక, డీసీపీ రాజేశ్ పరిశీలించి సహాయక చర్యలను పర్యవేక్షించారు.

మెరుగైన వైద్యం అందించాలి : సీఎం

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ) : ప్రమాదంలో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్‌కు సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో వెంటనే సహాయకచర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రమాదంపై కేసీఆర్ దిగ్భ్రాంతి

సౌత్‌గ్లాస్ పరిశ్రమ ప్రమాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సానుభూతి తెలిపారు.

రెండు లారీలు ఢీకొని ఐదుగురి దుర్మరణం

చేగుంట, జూన్ 28: మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఐదుగురికి గాయాలయ్యాయి. నాగ్‌పూర్ నుంచి 450 మేకల లోడ్‌తో హైదరాబాద్ వెళ్తున్న లారీ, మెదక్ జిల్లా చేగుంట మండలం పడియారం బైపాస్ రోడ్డులో ముందుగా వెళ్తున్న లారీని వేగంగా ఢీకొంది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఎండీ ఇబ్రహీం (21), చిక్వ రాజు (57), చిక్వ మనీశ్ (30), ఎండీ షబ్బీర్ ఖాన్ (48), ఎండీ జిసన్ (21) దుర్మరణం చెందగా రమేశ్, మహేశ్, శుక్లా ల్, లాల్ మని, బుట్టాసింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను గాంధీ దవాఖానకు తరలించారు. వందకుపైగా మేకలు మృత్యువాతపడ్డాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చేగుంట ఎస్సై తెలిపారు.

జూలై వరకు కాంట్రాక్ట్, గెస్ట్ లెక్చరర్ల కొనసాగింపు

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్ట్, గెస్ట్ లెక్చరర్లను జూలై 31 వరకు కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. శుక్రవారం ఇంటర్ విద్య డైరెక్టర్ శృతి ఓజా ఆదేశాలిచ్చారు. గెస్ట్ లెక్చరర్లకు జరుగుతున్న అన్యాయం, వారి పరిస్థితిపై 'నమస్తే తెలంగాణ' ఇటీవలే వరుసగా రెండు కథనాలు ప్రచురించింది. 'గెస్ట్ లెక్చరర్లు ఉన్నట్టా లేనట్టా', 'గెస్ట్ లెక్చరర్లకు రేవంత్ సర్కారు ధోకా' పేరుతో కథనాలను ప్రచురించింది.

435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు నోటిఫికేషన్

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్య శాఖలో 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదలైంది. డీఎంఈ, డీపీహెచ్, ఐపీఎం పోస్టులకు వచ్చే నెల 2నుంచి దరఖాస్తులు ప్రారంభం కాగా, 11తో ముగియనున్నవి. ఎంబీబీఎస్‌లో మెరిట్ ఆధారంగా 80 పాయింట్లు కేటాయించనున్నారు. ప్రభుత్వ దవాఖానలు, సంస్థల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నవారికి అనుభవం ఆధారంగా 20 మార్కులు కలుపుతారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్నవారికి ప్రతి ఆరు నెలల సర్వీస్‌కు 2.5 పాయింట్లు, గిరిజనేతర ప్రాంతాల్లో పనిచేస్తున్నవారికి 2 పాయింట్లు ఇవ్వనున్నారు. పే స్కేలు రూ.58,850 నుంచి రూ.1,37,050గా ఉన్నది.

రియల్ ఢమాల్

- గత మూడు నెలల్లో పడిపోయిన ఇండ్ల అమ్మకాలు
- మొదటి త్రైమాసికంతో పోలిస్తే 23 శాతం తగ్గుదల
- ఏకంగా 40 శాతం తగ్గిన కొత్త ప్రాజెక్టుల ప్రారంభం
- ఢిల్లీ, ముంబై వంటి మెట్రోనగరాల్లో పెరిగిన బిజినెస్
- అన్‌రాక్ నివేదికలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 28 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా కీలకమైన మెట్రో నగరాల్లో రియల్, నిర్మాణ రంగాలపై ఆర్నెల్లు, సంవత్సరానికి ఒకసారి జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పరిశోధన చేసి ఆ సర్వే వివరాలను తమ